ప్రజాశక్తి
బుధవారం 24 జులై 2024 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పారదర్శకంగా ఇసుక విధానం అమలు


అక్రమంగా తరలిస్తే చర్యలు : కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక విధానాన్ని పారదర్శకంగా ఎలాంటి లోటుపాట్లు జరగకుండా నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లో ఇసుక విధానంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, గనుల శాఖ అధికారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు ఇసుక సరఫరా చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. డంపు యార్డుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక పూడిక తీత కార్యక్రమాలు త్వరితగతన చేపట్టాలని అందుకు జల వనరుల శాఖ, మైనింగ్ శాఖ, రెవిన్యూ శాఖ, కాలుష్యం నియంత్ర మండల శాఖ వారి ఆధ్వర్యంలో జూలై 30 తేదీ లోపు కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. సంబంధిత తహశీల్దార్లు, మైనింగ్ అధికారులు, కొత్తగా ఇసుక రీచ్‌లు గుర్తించాలని తెలిపారు. వారంలో మూడుసార్లు మైనింగ్ అధికారులు డంపింగ్ యార్డ్ నందు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. సంబంధిత ఆర్డీవోలు, పంచాయతీ అధికారులతో నిరంతర పర్యవేక్షణ మైనింగ్ అధికారులు కలిగి ఉండాలని తెలిపారు. ఇసుక సరఫరాపై ఫిర్యాదులు, సలహాల కోసం ఒక కంట్రోల్ రూం, టోల్ ఫ్రీ నెంబరు 1800-425-6041ను ఏర్పాటు చేశామన్నారు. ఎవ్వరైనా ఈ నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. అక్రమ, అనధికారిక తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీవో వంశీకష్ణ, డిపిఒ విజయ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ఎస్ ఎస్ఇ మల్లికార్జున అధికారులు ప్రతాప్, కృష్ణారెడ్డి, క్రాంతి శేఖర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీలో పైసలెన్నో..?

- కేంద్ర బడ్జెట్‌లో నిధులపై కొరవడిన స్పష్టత
- కేంద్రీయ విశ్వవిద్యాలయంపైనా అదే స్థితి
- ఈ సారీ నిరాశే అంటున్న ఉమ్మడి జిల్లా వాసులు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన ఆర్థిక బడ్జెట్‌లో రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ అన్న ప్రకటన ఉంది. దీని పట్ల బిజెపితోపాటు కూటమి నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్యాకేజీలో నిధులు ఏ మేరకన్న స్పష్టత లేదని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రధానంగా వామపక్ష పార్టీలు ఈ అంశాన్ని లెవనెత్తుతున్నాయి. ఇదే రకంగా గతంలో ప్యాకేజీ అని ఏడాదికి రూ.50 కోట్ల చొప్పున మూడు సంవత్సరాలు నిధులు కేటాయించి తరువాత అటకెక్కించారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు ఈ ప్యాకేజీ కూడా అదే తరహాలోనే ఉంటుందా నిధులు ఏమైనా కేటాయిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. కేటాయిస్తే ఎన్ని నిధులు కేటాయిస్తారన్న దానిపైనా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ఎన్నికలకు ముందు ఓట్‌ఆన్ అకౌంట్‌గా ప్రవేశపెట్టారు. ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్ పూర్తి స్థాయిలో నిరాశపరిచే విధంగా ఉందన్న జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధులు నామమాత్రమేనా ?

రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విశ్వవిద్యాలయంకు నిధుల కేటాయింపులపై స్పష్టత లేదు. ఓట్‌ఆన్ అకౌంట్ బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులు జరగలేదు. అంతకు మునుపు ఏడాది కేటాయించిన నిధులతో మొదటి క్యాంపస్ నిర్మాణాలు పూర్తికావచ్చాయి. ఇంకా అనేక విడతల్లో పనులు చేపట్టాల్సినవి ఉన్నాయి. వాటికి నిధులు ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు నామ మాత్రమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంతకల్లు డివిజన్‌కు ప్రాధాన్యత తక్కిందా..!

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు నిధుల కేటాయింపులు ఏ మేరకు జరగాయన్నది తెలియాల్సి ఉంది. పింక్ బుక్ వచ్చాక కేటాయింపులపై స్పష్టత వస్తుంది. గత బడ్జెట్‌లలో గుంతకల్లు డివిజన్‌కు పెద్దగా కేటాయింపులు జరగలేదు. ఈ బడ్జెట్‌లోనూ పరిస్థితి ఏమిటన్నది స్పష్టత కావాల్సి ఉంది.

మాటలు సరే.. నిధులేవి..?


వి.రాంభూపాల్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు.



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వెనుకబడిన రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించింది. గత పది సంవత్సరాల క్రితం విభజన చట్టంలో భాగంగా వెనకబడిన ప్రాంతాల అభివద్ధికి బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీ గురించి హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆ ప్యాకేజీ అమలు కాలేదు. ఆర్థికమంత్రి ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ పేరు పలుసార్లు ప్రస్తావించారు. కానీ నిధులు కేటాయింపు మాత్రం నిరాశను కలిగించింది. చెప్పిన మాటల్లో కూడా స్పష్టత లేదు. ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర ప్రజల్ని మోసగించడానికి కేంద్రం ప్రయత్నించింది. రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్ల రూపాయలు పలు ఆర్థిక సంస్థల ద్వారా ఇప్పిస్తామని మంత్రి పేర్కొనటం వల్ల రాష్ట్రానికి, రాజధానికి మేలు జరగదు. 15 వేల కోట్ల రూపాయలు నేరుగా గ్రాంటుగా ప్రకటించాలి. పోలవరం, వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి, విభజన హామీల అమలు కట్టుబడి ఉంటామని చెప్పారే తప్ప వాటికి నిధుల ప్రస్తావన లేదు. పోలవరానికి 12 వేల కోట్లు కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరినా బడ్జెట్‌లో స్పందన లేదు. రైల్వే జోన్, కడప ఉక్కు, మెట్రో, విద్య, వైద్య సంస్థలు తదితర చట్టబద్ధమైన హామీలు బడ్జెట్‌లో చోటు చేసుకోలేదు. పుణ్యక్షేత్రాల టూరిజం, వరద నివారణ చర్యలు తదితర విషయాల్లో అనేక రాష్ట్రాలకు నిధులు కేటాయించినా, ఆంధ్రప్రదేశ్, తెలుగు రాష్ట్రాల ప్రస్తావన లేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, తెలుగుదేశం, జనసేన పార్టీలు కేంద్రంపైనా, బిజెపిపైనా రాజకీయ ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి రావాల్సిన నిధులు రాబట్టుకునేలా పోరాటం చేయాలి.

బడ్జెట్‌లో అన్యాయం

ఎన్.రఘువీరారెడ్డి, సిడబ్ల్యూసి మెంబర్



కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 11వ బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్రమైన అన్యాయం చేసింది. ప్రత్యేక హోదా ఊసే లేకపోవడం విచాకరం. పోలవరంపై మాట తప్పా, మరేది స్పష్టమైన హామీ లేదు. రాజధాని నిర్మాణానికి ఇచ్చిన రూ.15 వేల కోట్లు రుణంగా ఇచ్చిందా.. లేదా రాజధాని నిర్మాణానికి నిధులు కింద ఇచ్చిందా అన్న దానిపైనా స్పష్టత లేదు. ఎన్డీఏ ప్రభుత్వంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు మద్దతుతో ఉండడంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులు వస్తాయని అందరూ ఆశించారు. అయినా నిరాశే మిగిలింది. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయమని చెప్పలేదు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడి నిధులను తెచ్చుకునేందుకు కేంద్రంపై పోరాటం చేయాలి.

నిధులు శూన్యం



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయించిన నిధులు శూన్యం. అమరావతి అభివద్ధికి రూ.15వేల కోట్లు అప్పుగా కాకుండా నేరుగా గ్రాంట్ ప్రకటించకుండా మోసం చేశారు. అప్పుగా ఇవ్వడం వల్ల రాష్ట్రం మరింత ఆర్థిక సంక్షోభంలోకి వెళ్తుంది. విభజన చట్టం ప్రకారం 2014 నుంచి వెనుకబడిన ప్రాంతాలకు రూ.2000 కోట్లు విడుదల చేయాల్సున్నా దానిపై ప్రకటన చేయలేదు. ప్రత్యేక హోదా విషయాన్ని గాలికి వదిలేసారు. ఏ విధంగా చూసినా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం జరిగింది.

జాఫర్,
సిపిఐ జిల్లా కార్యదర్శి, అనంతపురం.

వేతన జీవులకు నిరాశ

కేంద్ర బడ్జెట్‌లో వేతన జీవులకు మరోసారి నిరాశ మిగిలింది. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేశారు. దీనివల్ల వేతన జీవులకు ఎలాంటి మేలూ జరగదు. పాత పెన్షన్ విధానంపై బడ్జెట్లో ప్రస్తావన లేదు. ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ సంబంధించి పాత పద్ధతి కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించాల్సి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారు. విద్యారంగానికి బడ్జెట్లో కేటాయింపులు ఆరు శాతం కేటాయించాల్సి ఉండగా 3.25 శాతం మాత్రమే కేటాయించారు. ఉద్యోగాల కల్పనపై ప్రస్తావన చేయలేదు. మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా పాత పెన్షన్‌ను పునరుద్ధరించే దానిపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదు.

జయచంద్రారెడ్డి, సుధాకర్
యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు.
శ్రీసత్యసాయి జిల్లా.

రాత్రి వేళల్లో గస్తీ పెంచాలి : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైం



పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

రాత్రి వేళల్లో మరింత గస్తీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ వి.రత్న పోలీసు సిబ్బందిని ఆదేశించారు. పుట్టపర్తి రూరల్, ప్రశాంతి నిలయం సెక్యూరిటీ వింగ్ పోలీస్ స్టేషన్లను మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణం, గదులు, రిసెప్షన్ కౌంటర్, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ రికార్డులు, పట్టుబడిన ద్విచక్ర వాహనాలు, ముఖ్యమైన సిడి ఫైల్స్‌ను, తనిఖీ చేశారు. మహిళలపై జరిగిన దాడుల నమోదు కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. గస్తీ విధులు పటిష్టంగా నిర్వర్తించి నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సాయంత్రం వేళల్లో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. ప్రశాంతి నిలయంకు దేశ విదేశాల నుంచి భక్తులు వస్తూ ఉంటారని, వారికి ఎటువంటి భద్రతా లోపాలు తలెత్తకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, సెక్యూరిటీ వింగ్ సిఐ ప్రవీణ్ కుమార్, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్ కుమార్ ఉన్నారు.

ఎస్పీని కలిసిన పెనుకొండ సబ్ కలెక్టర్

పెనుకొండ : ఎస్పీ రత్నను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ కలిశారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలపై పలు విషయాలను ఇద్దరూ చర్చించారు.

గృహ నిర్మాణాల్లో 'రాక్రీట్' అక్రమాలు

విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి, మంత్రికి పరిటాల సునీత ఫిర్యాదు

ప్రజాశక్తి-ఆత్మకూరు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె సీఎం క్యాంప్ కార్యాలయానికి వెళ్లి అన్ని అంశాలను వివరించారు. గహనిర్మాణ శాఖ మంత్రి పార్థసారథిని కలిసి జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రాక్రీట్ సంస్థ పేరుతో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి కాంట్రాక్టు తీసుకున్నారని, ఇళ్ల నిర్మాణాలు చేయకుండా రూ.200 కోట్లు డబ్బులు కాజేశారన్నారు. రూ.1,100 కోట్ల విలువైన పేదల ఇళ్ల నిర్మాణాన్ని అప్పటి వైసిపి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి బంధువు, అనుచరవర్గం డైరెక్టర్లుగా ఉన్న గుత్తేదారు సంస్థ రాక్రీట్ సంస్థకు తీసుకుని డబ్బులు కాజేశారన్నారు. దీనిపై విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. రామగిరి మండలంలోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు)కు నీరందించే పనులు మళ్లీ ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. రిజర్వాయర్ కోసం రైతులు భూములు ఇచ్చారని, ఆ రైతులకు నేటి ధరల ప్రకారం పరిహారం మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల హామీగా పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు నిర్మించి పేరూరుకు నీరందిస్తామని హామీ ఇచ్చినట్టు వివరించారు. రామగిరి మండలం నసనకోటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను ఇంటర్మీడియట్ వరకు ఉన్నతీకరించాలని బీసీ సంక్షేమ మంత్రి సవిత, సంబంధిత శాఖ సెక్రటరీకి వినతి పత్రం అందజేశారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్‌కు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

కలెక్టర్‌ను కలిసిన పరిటాల శ్రీరామ్

పుట్టపర్తి అర్బన్ : పుట్టపర్తి కలెక్టర్ కార్యాలయంలో టిడిపి ధర్మవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కలెక్టర్ టిఎస్.చేతన్‌ను మంగళవారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లామని, నియోజకవర్గ అభివద్ధికి తోడ్పాటు అందించాలని కలెక్టర్‌ను కోరామన్నారు.

బస్సు ఆపలేదని విద్యార్థుల ఆందోళన

రొద్దం : రొద్దం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మండలంలోని రొద్దకంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు మంగళవారం గ్రామ సమీపంలోని రోడ్డు పై ఆర్టీసీ బస్సు వెళ్లకుండా కూర్చొని నిరసన చేపట్టారు. హిందూపురం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ సోమవారం విద్యార్థులకు బస్సులో ఎక్కించుకోకుండా వెళ్లిపోయాడని దీంతో తాము పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డామని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల కుటుంబసభ్యులు బస్సు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు.

ఆర్టీసీ బస్సు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పాఠశాలల్లో పోషకాహార గార్డెన్‌లు : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల్లో పోషక ఆహార గార్డెన్‌ను అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో జిల్లాలో మొదటి విడత పోషక ఆహార గార్డెన్స్ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో మీనాక్షి, మధ్యాహ్న భోజనం పథకం అమలు అధికారి రామకృష్ణ, ఐసిడిఎస్ పీడీ నాగమల్లీశ్వరి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి పోషణ శక్తి నిర్మాణం పథకములో అమలులో భాగంగా ప్రతి పాఠశాలలో స్కూల్ న్యూట్రిషన్ గార్డును ప్రారంభించడానికి చర్యలు చేపట్టాలని తెలిపారు, సాంకేతిక సహాయం, శిక్షణ, విత్తనాలు, నారు, ఎరువులు మొదలైన వాటిని కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయం, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ లైన్ విభాగాలతో కలిసి పొందవచ్చున్నారు. సరిహద్దు గోడ నిర్మాణం, భూమిని చదును చేయడం మొదలైన కార్యకలాపాలను నేరుగా పథకం కింద చేపట్టు వచ్చునని పేర్కొన్నారు. తోట పని పట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఆయా పాఠశాల ఖాళీ స్థలాలలో విద్యార్థులచే పొద్దు తిరుగుడు పువ్వులు, మొక్కజొన్న, గుమ్మడికాయలు, టమాటాలు, బంగాళదుంపలు వంటి ఆసక్తికరమైన మొక్కలు పెంచే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. గార్డెనింగ్ కోసం ఎకో క్లబ్బు కింద సాధన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిడిపిఒలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చు'

ప్రజాశక్తి - మడకశిర

ఖరీఫ్ సీజన్లో సాగు చేసే వేరుశనగ పంటను ఆగస్టు మొదటి వారం వరకు విత్తుకోవచ్చుని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని ఎర్ర బొమ్మనహళ్లి , భక్తరహళ్లి, గ్రామాలలో సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ వేరుశనగను ఆగస్టు నెల మొదటి వారం వరకు విత్తుకోవచ్చుని రైతులు అధైర్య పడద్దనిసూచించారు. వేరుశనగ తో పాటు అంతర పంటగా కందులు, అలసందలు వేసుకుంటే అదనపు ఆదాయాన్ని పొందవచ్చుని అన్నారు.

ఆంధ్ర సరిహద్దుకు తుంగభద్ర జలాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

సోమవారం నాడు విడుదల చేసిన తుఉంగభద్ర జలాలు ఆంధ్ర సరిహద్దుకు మంగళవారం సాయంత్రం చేరుకున్నాయి. బొమ్మనహాళ్ మండలం తుంగభద్ర ఎగువ కాలువ 105వ కిలోమీటర్ వద్ద ఆంధ్ర రాష్ట్ర సరిహద్దులోకి మంగళవారం రాత్రి ప్రవేశించాయి. నీటి రాకతో స్థానికులు, రైతులు తుంగభద్ర జలాలకు పూజలు జరిపారు. అనుకున్న సమయానికి కాలువలకు నీరు రావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తుంగభద్ర నుంచి జిల్లా సరిహద్దుకు వస్తున్న నీరు



బొమ్మనహాల్ జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న నీరు

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-సోమందేపల్లి

మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 17వ విడత జరిగిన ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక తూతూమంత్రంగా కొనసాగింది. ఈ సమావేశంలో పట్టుమని పదిమంది రైతులు కూడా కన్పించకపోవటం గమనార్హం. అధికారులు సరైన దిశా నిర్దేశం చేయలేకపోయారా లేక కావాలనే రైతులను పిలిపించలేకపోయారా అన్న సందేహాన్ని ప్రజల వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం నిర్వహించిన సామాజిక ప్రజావేదిక సమావేశానికి డ్వామా ప్రోసిడింగ్ ఆఫీసర్ శివశంకర్, ఏపీడీ శివానంద నాయక్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, డ్వామా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఎస్ఆర్పి చౌదరి, ఏపీవో సోమశేఖర్ రెడ్డి, ఈసీ గంగాధర్ తదితరులు హాజరయ్యారు. ఉపాధి హామీ పనులపై జరిగిన సామాజిక తనిఖీల్లో బహిర్గతమైన అవినీతికి సంబందించిన మొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద 915 పనులకు గాను నాలుగు కోట్ల డెభై లక్షల రూపాయలు ఖర్చు చేశామన్నారు. అందులో రూ. 85 లక్షలు సచివాలయాల నిర్మాణం తదితర నిర్మాణాలకు వినియోగించడం జరిగిందన్నారు. ఇందులో 29,950 రూపాయలు రికవరీకి ఆదేశించడం జరిగిందన్నారు. పెన్షన్ల పరంగా రెండు లక్షల 31 వేల రూపాయల్లో పరిశీలించగా అందులో 75 వేల రూపాయలు రికవరీకి ఆదేశించామని మిగిలిన 54 వేల రూపాయలకు విచారణ చేయాల్సి ఉందని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మండలంలో 16 పంచాయతీల్లో సుమారు 47 గ్రామాలు ఉండగా సామూహిక ప్రజావేదికలో కనీసం పట్టుమని పదిమంది రైతులు కూడా పాల్గొనక పోవటం గమనార్హం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని ప్రజావేదికలో ప్రజలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్రీడాకారులకు స్పెయిన్ బృందం చేయూత

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు స్పెయిన్ బృందం క్రీడాదుస్తులను అందజేసింది. స్పెయిన్ దేశానికిచెందిన అంతర్జాతీయబాస్కెట్‌బాల్ కోచ్‌లు మౌర్, ఒరియల్,నటాలియా, పోల్లు బాస్కెట్బాల్ క్రీడాకారులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ తోపాటు షూస్‌ను అందజేశారు. ధర్మాంబ బాస్కెట్‌బాల్ అసోషియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయతుల్లా చేతులమీదుగా వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంజయ్, ఆత్మీయట్రస్టు సభ్యులు జస్వంత్, హరిజిశ్రణవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

చిరుధాన్యాల పంటల సాగు లాభదాయమని ఎడిఎ సనావుల్లా అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామ రైతులకు చిరుధాన్యాల పంటలపై అవగాహన కల్పించారు. కొర్ర, సద్ద, జొన్న, రాగి, సామ, ఉలవ లాంటి చిరుధాన్యాల సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, ఆత్మ సిబ్బంది, అధికారులు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వికలాంగులకు రైల్వే పాసులు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి నియోజకవర్గ పరిధిలోని 191మంది వికలాంగులకు రైల్వే శాఖ పాసులు మంగళవారం అందజేశారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ చేతుల మీదుగా రైల్వే రాయితీ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు రాయితీతో రైల్వే పాసులు అందజేస్తోందన్నారు.

సక్రమంగా విద్యుత్ సరఫరా చేయాలి

కొత్తచెరువు : కొత్తచెరువు గ్రామపంచాయతీలో గృహ అవసరాలకు ఉపయోగించే విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అశోక్, యుగంధర్ తదితరులు మాట్లాడుతూ బీసీ, వడ్డెర కాలనీలో విద్యుత్తు హై వోల్టేజ్‌తో సరఫరా అవుతుండటంతో ఇళ్లలోనే ఎలక్ట్రికల్ పరికరాలు ధ్వంసం అవుతున్నాయని వాపోయారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వారు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. స్పందించిన ఎఇ వెంకటేష్ నాయక్ మాట్లాడుతూ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

శిశు ఆధార్ సేవలు

కొత్తచెరువు : ప్రభుత్వం మరోసారి ప్రవేశపెట్టిన శిశు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పుష్ప కోరారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ మంగళవారం నుంచి సమీప అంగన్వాడీ కేంద్రాలలో శిశు ఆధార్ సేవలను ప్రారంభించారన్నారు. 27వ తేదీ వరకు కొత్తచెరువు మండల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలలో ఉచిత ఆధార్ నమోదు సేవలు అందిస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దుర్గమ్మకు బోనాలు

ధర్మవరం టౌన్ : పట్టణంలో పలు ప్రాంతాలకు చెందిన మహిళలు ఆషాడమాసం మంగళవారం దుర్గమ్మకు బోనాలు సమర్పించారు. ప్రధానంగా ప్రియాం కనగర్, సిద్దయ్యగుట్ట, దుర్గానగర్, యాదవవీధి, లోనికోట ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

మొక్కలు నాటిన 'ఇన్నర్ వీల్' ప్రతినిధులు

హిందూపురం : హిందూపురం రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఎల్ ఆర్ జి పబ్లిక్ స్కూల్ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కలు మానవ మనుగడకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను బాధ్యతగా పెంచడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటి ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ భారతి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు విద్య, కార్యదర్శి అశ్వర్థలక్ష్మి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీవాణి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు తులజా బాయి, లక్ష్మి రంగారావు, భువనేశ్వరి, గౌరి తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఇన్నర్‌వీల్ ప్రతినిధులు

ఈవీఎంలను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం మార్కెట్‌యార్డ్ గోదాముల్లో భద్రపరచిన ఈవీఎంలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ టీఎస్.చేతన్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎం యంత్రాలు, భద్రతా చర్యలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఉపయోగించుటకు వీలు కానీ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్ నెంబర్లను ఈఎంఎస్ సాఫ్ట్వేర్ పద్ధతి ద్వారా స్కాన్ చేసి ఈవీఎం ప్రోటోకాల్ పాటిస్తూ ప్రత్యేక పోలీసుబందోబస్తుతో ఎన్నికల నిబంధనల మేరకు బెంగుళూర్ లోని బెల్ కంపెనీకి మరమత్తుల నిమిత్తం పంపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, ఎన్నికల డీటీ మైనావుద్దీన్, తహాశీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా కుల ధ్రువీకరణ పత్రాల జారీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

పకడ్బందీగా కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలను జారీ చేయాలని ఈ విషయంలో రెవెన్యూ ఉద్యోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మంగళవారం కొత్తచెరువులోని ఎస్సీ కాలనీలో పర్యటించారు. కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు ఆధార్ రేషన్ కార్డు ఇచ్చారా లేదా అని ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వేగవంతంగా ఈ కార్యక్రమాన్ని రెవిన్యూ సిబ్బంది కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కళావతి, డీటీ స్వాతి, వీఆర్వో వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లావ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి కూలీలు చేసిన పనులకు బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఆర్ఒకు సమర్పించారు. 10 వారాల నుండి బిల్లులు బకాయి ఉన్నాయని అన్నారు. 10 సంవత్సరాల నుండి ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వలేదని అన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పని దినాలు కుటుంబానికి 100 రోజులు సరిపోవడం లేదనీ 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా 600 రూపాయలు చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేశులు, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, నాయకులు గంగాధర్ , వెంకటేశులు , ఉపాధి కూలీలు నాగరాజు, గోపాల్ , కౌలు రైతు సంఘం కదిరప్ప, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు బ్యాల్ల అంజి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి యువకుడు మృతి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ సమీపంలో యువకుడు రైలు కింద పడి మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో మృతునిశరీరం రెండు భాగాలుగా విడిపోయింది. హిందూపురం రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని పెనుకొండ పావగడ ప్రధాన రహదారిలో కర్నాటక సరిహద్దు వద్ద మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన అనిల్‌కు గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న అనిల్ పీర్ల పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. పావగడకు ఇద్దరు స్నేహితులతో కలసి ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కర్నాటక సరిహద్దు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అనిల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో 108వాహనంలో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లికి చెందిన ఉపాధి కూలీ జంపన ఆదినారాయణ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. మంగళవారం ఉదయం ఉపాధి పనులు చేస్తున్న ఆదినారాయణ గుండెపోటుకు గురై పనిచేసే చోటే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో మాబుఖాన్, ఏపీవో హారున్ రషీద్, రెవిన్యూ సిబ్బంది మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ఉచిత డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-పెనుకొండ

డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం స్థానిక బీసీ సంక్షేమ కార్యాలయంలో డీఎస్సీ కోచింగ్ అప్లికేషన్లు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తక్షణం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి సవిత ఉచిత డిఎస్సీ కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు కృషి చేశారన్నారు. పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన కోచింగ్ కేంద్రాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, త్రివేద, నంజుండ, నరేంద్ర, సుబ్రహ్మణ్యం, చెంద్రాయుడు, సోము, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా జలాలు అందించాలి

ప్రజాశక్తి-హిందూపురం

మడకశిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని అన్ని చెరువుల్లోనూ పూడిక తీయించి హంద్రీనీవా జలాలు అందించాలని జలసాధన సమితి, రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీర్ యోగానందకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, జలసాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, హంద్రీనీవా కాలువ పూడిక తీసి, మరమ్మత్తులు పూర్తిచేసి మడకసిర బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న 265 చెరువులను నీటితో నింపాలన్నారు. ఈ వర్షాకాలంలో మొదటి దశలోనే నింపే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ విషయంలో హిందూపురం శాసనసభ్యులు బాలకృష్ణ, మంత్రి సవిత, మడకశిర శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, జల సాధన సమితి ప్రతినిధులు ధనాపురం వెంకటరామిరెడ్డి, ఎం. శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన జేసీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువులోని శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తనిఖీ చేశారు. పుస్తకాలను, రికార్డులను పరిశీలించారు. పాఠకులు ఎంతమంది సభ్యత్వం తీసుకున్నారని ప్రతిరోజు ఇక్కడికి ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నిరుద్యోగులు పాఠకులు ఈ గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలన్నారు గ్రంథాలయాల్లోని సభ్యత్వాన్ని నమోదును పెంచే విధంగా చీరలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కళావతి, డిటి స్వాతి, ఎంఇఒ జయచంద్ర, గ్రంథాలయ అధికారి జయరాం, అటెండర్ వెంకటరమణ, వీఆర్వోలు వేణుగోపాల్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్‌ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

బుక్కపట్నం మండల కేంద్రంలో ఉన్న సాయి చంద్ర గ్యాస్ ఏజెన్సీ నిర్వాకం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఇఎస్ వెంకటేష్, శాఖా కార్యదర్శి బ్యాళ్ల అంజి డిఆర్ఒ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బుక్కపట్నంలో ఉన్న గ్యాస్ ఏజెన్సీ యాజమానులు వ్యక్తిగత గొడవలతో ప్రజలకు ఇబ్బంది కలిగించడం సరైంది కాదన్నారు. గ్యాస్ ఏజెన్సీ కి సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి ప్రజలకు గ్యాస్ సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాలుగు వారాలుగా ప్రజలకు గ్యాస్ అందుబాటులో లేకపోవటంతో బుక్కపట్నం మండల ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పెద్దన్న, జిల్లా నాయకులు ఎం గంగాధర్, చంద్ర, సిఐటియు నాయకులు వెంకటేష్, శ్రీనివాసులు, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని సుందరయ్య నగర్‌లో గల శ్రీ గణేష్ పురపాలక ప్రాథమిక పాఠశాలలోని 400 మంది విద్యార్థులకు దాత మడకం చందు విద్యాసామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. మడకం చౌడయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మడకం చందు 50 వేల రూపాయలు విలువైన విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ రాజేశ్వరి దేవి, భాను ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యాసామగ్రి అందజేస్తున్న దృశ్యం

సిఐటియు మండల కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - ఆమడగూరు

మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సిఐటియు మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఒడిసి మండల కన్వీనర్ కుళ్లాయప్ప ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా మద్దె కేశవ, కో కన్వీనర్‌గా మాబూబాషా, కోశాధికారిగా బావయ్య, కమిటీ సభ్యులుగా వేణు తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కిష్టమ్మ, సరస్వతి, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు అలివేలమ్మ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకర తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్ : పట్టణంలో బస్టాండ్ సమీపంలోని మాధవ రాయుని దేవాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు నూతన కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా కమల్ బాషా,కో కన్వీనర్‌గా గంగాధర్‌తో పాటు పది మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మండలంలోని కార్మికులను ఐక్యం చేసి వారి సమస్యలను ఎప్పటిప్పుడు పరిష్కరించేందుకు సిఐటియు కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, రాము, ఈశ్వరమ్మ, అంగన్ వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు నాగజ్యోతి, పద్మ, ఆటో యూనియన్ నాయకులు వలిబాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులతో సమీక్ష

ఓబుళదేవర చెరువు : స్థానిక రైతు సేవా కేంద్రం నందు కౌలు రైతులతో .అధికారులు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న కదిరి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్‌సత్యనారాయణ మాట్లాడుతూ మట్టినమూనాలు సేకరించి త్వరగా సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపాలని అధికారులకు సూచించారు. రైతు సేవ కేంద్రాలలో ఎరువులు నిల్వ ఉంచాలన్నారు. పిఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ తొందరగా పూర్తి చేయాలన్నారు. మండలంలోని పంట పరిస్థితులు పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ మహమ్మద్, రైతు సేవా కేంద్రం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలేదీక్షలు

కదిరి అర్బన్ : న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి చేసిన దుండగుల అరెస్టులో పోలీసుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ స్థానిక న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడి జరిగి దాదాపు నెల రోజులు కావస్తున్న పోలీసులు దుండగులను అరెస్టు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, ప్రసాద్ రెడ్డి,మహమ్మద్ పైజుల్లా, వరప్రసాద్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌ఇ 2024లో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఎస్‌డిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ విషయంపై పెనుగొండ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన చేసి అధికారికి వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ ని విడుదల చేసి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని గొప్పగా ప్రకటించిందన్నారు. అయితే ఈ పోస్టుల్లో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు లేకపోవడం తీవ్ర విస్మయానికి గురి చేస్తోందన్నారు. రాష్ట్రంలో రెండవ అధికార భాషగా గుర్తింపు పొందిన ఉర్దూ విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. దీంతోపాటు కమిషనర్ ఆఫ్ మైనారిటీస్ స్పాన్సర్ స్కీం, ప్రైమ్ మినిస్టర్ న్యూ 15 పాయింట్స్ ప్రోగ్రాం ఫర్ వెల్ఫేర్ ఆఫ్ మైనార్టీస్ ఈ స్కీం కింద ఏ స్కూల్ లో అయితే విద్యార్థులలో 1/4వ శాతం మైనార్టీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారో ఆ స్కూళ్లలో ఉర్దూ అభ్యసించేందుకు ఒక ఎస్జీటీ ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాల్సి ఉందన్నారు. సత్యసాయి జిల్లాలో 2023 వరకు దాదాపుగా ఈ సెంట్రల్ స్కీం కింద 94 ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నట్టు అధికారిక సమాచారం అన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులు అన్నింటిని భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డిపిఐ నాయకులు నబి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ

ప్రజాశక్తి- పెనుకొండ

పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రిని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని వైద్యుడు శివకుమార్‌కు హామీ ఇచ్చారు. అంతకుముందు గ్రంథాలయం, తహాశీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. తహాశీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో రాణించడం అభినందనీయం

హిందూపురం : హిందూపురం ప్రాంతానికి చెందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని వన్ టౌన్ సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ముదిరెడ్డిపల్లి కరాటే శిక్షణ కేంద్రంలో వన్ టౌన్ సిఐ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య శిక్షకులు ఫైరోజ్ తో పాటు శిక్షకులు నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్


ఏపీ రాజధాని అమరావతి కి కేంద్ర ప్రభుత్వం రూ.15వేల కోట్లు కేటాయించడంపై పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల కలల రాజధాని నిర్మాణం కోసం ప్రత్యేక సాయం నిధి కింద కేంద్ర బడ్జెట్లో ఈ ఏడాదికి రూ.15వేల కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించడంతో పాటు అవసరాన్ని బట్టి అదనంగా ఆ నిధులను ఇస్తామని ప్రకటించడం హర్షనీయమన్నారు. ఏపీకి జీవ నాడి అయిన పోలవరం ప్రాజెక్టు ను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రకటనపై ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ముదిగుబ్బ : ఏపీ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు కేటాయించడంపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బిజెపి మండల అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఏపీ ప్రజల కలల రాజధాని నిర్మాణం కోసం స్పెషల్ సపోర్ట్ కింద కేంద్ర బడ్జెట్లో ఈ ఏడాదికి గానూ రూ.15వేల కోట్లు కేటాయించిన ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పెనుకొండ : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషితోనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని ఎంపీ పార్థసారధి అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా రాజధాని అమరావతికి రూ. 15 వేల కోట్ల నిధులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. నిధుల కేటాయింపునకు ప్రత్యేక శ్రద్ధ చూపిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ బాబు, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మవరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎన్‌డిఎ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజధాని నిర్మాణం కోసం స్పెషల్ సపోర్టింగ్ కింద కేంద్ర బడ్జెట్లో ఈ ఏడాదికి రూ.15వేల కోట్లుకేటాయించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు మంత్రి సత్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్థికశాఖ మంత్రి ప్రకటించడం హర్షనీయమన్నారు.

పెనుకొండ : అమరావతి, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించడం శుభపరిణామం అని తెలుగు దేశం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఎపి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, కేశవయ్య, పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, రూరల్ కన్వీనర్ సిద్దయ్య, మాజీ సర్పంచి అశ్వర్థ నారాయణ, లక్ష్మి నారాయణ రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, త్రివేద, రెడ్డి వారి మంజునాథ్,, బాబి రెడ్డి ,సుబ్రహ్మణ్యం సోము, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న పరిటాలశ్రీరామ్

ధర్మవరం టౌన్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషివల్లే రాష్ట్రానికి నిధులు వస్తున్నాయని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం ధర్మవరంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. తొలి బడ్జెట్ లోనే ఏపీకి నిధులు కేటాయించారని, ఇదంతా చంద్రబాబు కృషి అని అన్నారు. ఇక పోలవరం, రాజధాని నిర్మాణపనులు పరుగులు పెడతాయన్నారు. అన్నిటికంటే ముఖ్యంగా రాయలసీమ, ప్రకాశం, కోస్తాంధ్రలలో వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం ప్రకటించడంపై పరిటాలశ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

నిరాశపరిచిన కేంద్ర బడ్జెట్


ప్రజాశక్తి - కొత్తచెరువు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను నిరాశపరిచిందని యుటిఎఫ్ అధ్యక్షులు జయచంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ విమర్శించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ పాత పనుల విధానంలో ఎలాంటి మార్పు చేయకుండా కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేశారని దీనివలన వేతన జీవులకు ఎలాంటి మేలు జరగదని అన్నారు. ఉద్యోగుల ఇన్కమ్ టాక్స్ సంబంధించి పాత పద్ధతి కంటే కొత్త విధానంలో పన్ను ఎక్కువ చెల్లించి రావడంతో ఉద్యోగులు పాత విధానానికి మొగ్గు చూపుతున్నారన్నారు. 10 సంవత్సరాలలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారన్న ప్రస్తావన కూడా చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, సహా అధ్యక్షులు సీతామహాలక్ష్మి, కోశాధికారి శ్రీనివాసులు, సంఘం నాయకులు మారుతి, శ్రీనివాసులు, తాహిర్ వలి, శివశంకర, హరికృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను నిరాశకు గురిచేసిందని ఉపాధ్యాయ సంఘాలు విమర్శించాయి. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా, కొత్త పన్నుల విధానంలో మాత్రమే మార్పులు చేయడం వల్ల వేతన జీవులకు ఎలాంటి ఊరట కలగలేదని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి. శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు సి. తాహెర్ వలి, వై.వి .సుబ్బారెడ్డి, సునీల్ కుమార్, మల్లికార్జున, ఆజంబాషా విమర్శించారు. సిపిఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెబుతూనే పాత పెన్షన్ విధానం పై పల్లెత్తు మాట బడ్జెట్లో లేకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ కలిగించిందన్నారు. ఇప్పటికైనా మధ్యతరగతి ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే విధంగా పాత పెన్షన్ పునరుద్ధరించి, దానిపై ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలన్నారు. పన్నుల స్లాబ్ విధానాన్ని సవరించాలి, కనీసం లక్ష రూపాయల స్టాండర్డ్ డిటెక్షన్‌గా మినహాయింపులు ఉండాలన్నారు.

హిందూపురం : కేంద్ర బడ్జెట్ ఉద్యోగులను తీవ్ర నిరాశ పరచిందని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నూతన పెన్షన్ విధానంలో మార్పుల దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందనే ప్రచారం ఒకవైపు జరుపుతూ ప్రస్తుతం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ లో పాత పెన్షన్ ప్రస్తావన లేకపోవడం సరైంది కాదని విమర్శించారు.

అభివృద్ధికి తోడ్పడని బడ్జెట్ : సిఐటియు



పుట్టపర్తి రూరల్ : కేంద్ర బడ్జెట్ అభివృద్ధికి, ఉపాధికి తోడ్పడటం లేదని సామాన్య ప్రజానీకానికి పేద ప్రజలకు ఎలాంటి లాభం చేకూరదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.ఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ సామాన్య ప్రజలకు తోడ్పడుతుందని ముందుగానే మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారని అయితే ఇది తీవ్ర నిరాశ కలిగించిందని విమర్శించారు. ప్రతి సంవత్సరం కోటి మందికి ఉపాధి కల్పించేందుకు మూడు పథకాలు ప్రవేశపెట్టామని ఆర్థిక మంత్రి గొప్పగా చెప్పారని వాస్తవంగా ఈ పథకాలు ఉపాధి పెంచేవి కావని అన్నారు. 2022- 2023 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ఉపాధికి ఖర్చు చేసిన మొత్తం కంటే ఈ బడ్జెట్లో చేసిన కేటాయింపు తక్కువగా ఉన్నాయని అన్నారు.



అత్యున్నత విద్యాశిఖరం.. అనంత జెఎన్‌టియు..!

వార్త 4లో

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
విద్యాదర్శిని
అనంతపురం, శ్రీ సత్యసాయి (జిల్లా) ప్రత్యేక అనుబంధం
8 పేజీలు | బుధవారం | 24 జులై, 2024

క్వాలిటీ విద్యకు కేరాఫ్ 'మోక్షిత్' స్కూల్

ప్రజాశక్తి-అనంతపురం

అధునాతన తరగతి గదులు, ఉన్నత విలువలతో క్వాలిటీ విద్యకే కేరాఫ్‌గా విన్సెంట్‌ఫెర్రర్ నగర్‌లోని షిర్డీసాయి మోక్షిత్ స్కూల్ నిలుస్తోంది. పేదింటి విద్యార్థులకు నేస్తంగా పాఠశాల విరాజిల్లుతోందని పాఠశాల కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ అధునీకరించిన తరగతి గదులతో నూతన విద్యావిధానానికి శ్రీకారం చుట్టామన్నారు. అందరికీ విద్య... అందరి బాధ్యతగా అభివర్ణించారు. విద్యాసంస్థను విద్యావేత్తలే నడిపితే ప్రతి విద్యార్థి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో అత్యుత్తమ బోధన అందిస్తున్నామన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో చదువులో రాటుదేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సిసిటివి పర్యవేక్షణలో నిరంతరం విద్యార్థుల పట్ల పర్యవేక్షణ ఉంటుందన్నారు. మ్యాథ్స్, పిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్ట్‌లకు ల్యాబ్‌లు ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, మ్యాథ్స్‌పై ప్రత్యేక ఫోకస్ ఉంటుందన్నారు.



విద్యార్థినిని ఆశీర్వదిస్తున్న కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి, హెచ్.ఎమ్.లక్ష్మీసుబ్బారెడ్డి



పాఠశాలలో కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

వీక్లీ సిడిఎఫ్, వీకెండ్ ఎగ్జామ్, గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తూ విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థమయ్యే అవకాశం ఉంటుందన్నారు. ఏటా వచ్చే వివిధ పండుగల విశిష్టత తెలిపేలా దినోత్సవాలు నిర్వహిస్తూ విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ అవేర్‌నెస్ తీసుకువస్తున్నామన్నారు. మరింత ఉన్నతంగా విద్యాబోధన అందించడమే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

డిజిటల్ విద్యాబోధనలో

'విజయ స్కూల్'

ప్రజాశక్తి-అనంతపురం

వినూత్న విద్యాబోధనలు, డిజిటల్ విద్యాబోధనతో నగరంలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న విజయ పబ్లిక్ స్కూల్ విరాజిల్లుతోంది. ఈ సందర్భంగా ప్రజాశక్తితో పాఠశాల కరస్పాండెంట్ గంగాధర్, ప్రిన్సిపాల్ తేజస్విణి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యను అందించేందుకు డిజిటల్ పద్ధతులను అవలంబిస్తున్నామన్నారు. స్మార్ట్ తరగతులు, ఆడియో, వీడియో లెసన్స్‌తో పాఠ్యాంశాల బోధన ఉంటుందన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠ్యాంశాలు, చిన్నారులలో ప్రగతి చూడడం కోసం విశిష్టమైన పేరెంట్ సెక్షన్, అపరిమిత అవకాశాలు ఐదు అంశాలతో మెరుగైన విద్యను అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న రోజుల్లో ఇదే తరహా బోధన అంశాలతో మరింత మెరుగైన విద్యను అందించేలా చర్యలు చేపట్టామన్నారు.





విజయ పబ్లిక్ స్కూల్ (ఇన్‌సెట్‌లో) ప్రిన్సిపల్ తేజస్విణి

నవోదయ, గురుకుల కోచింగ్ కేరాఫ్

'ఎస్‌పిఎల్‌ఎన్‌ఎస్' పాఠశాల

ప్రజాశక్తి-అనంతపురం

